# కృష్ణార్పణం

"రాచ కార్యాల కేమి గాని ఈ మాటు మన కృష్ణయ్యకో చక్కటి సంబంధం చూసుకొస్తాలే! " అని నంద మహారాజు వెళ్తూ వెళ్తూ అన్న మాటతో ఎన్ని జరిగాయి! ఎన్నెన్నో జరిగాయి.

"భలే వారే! అప్పుడే పెళ్ళేమిటి? మన కన్నయ్య ఇంకా చిన్నవాడే కదా!..." అని యశోద కృష్ణుడి చుట్టూ చేతులు గుండ్రంగా తిప్పింది. ఆ చేతులు ఒక హొయలుగా తన చెంపలకే చేర్చుకుని దిష్టి చూపులు చిట్లినట్లుగా మెటికెలు విరిచింది.

పాలలో మీగడ మెరిసినట్టుగా కృష్ణుడి పెదవుల మీద సోగ వెన్నెల నవ్వు మెరిసిపోయింది. మామూలు మెరుపా అది! ఆకాశ నీలాలలో ఒక సన్నటి తెలి మబ్బు చార. పాలపుంత కింద రెక్కలార్చుతూ దూసుకు పోయే సువర్ణ రాజ హంస.

ఆ నవ్వుతోనే యశోద బ్రతుకంతా వెన్నెల మైక మైపోవడం లేదూ?

వెర్రి దానిలా యశోద ఆ నవ్వులో సోలి పోతుండ గానే అత్తగార్ల వరసైన ముగ్గురు ముత్తయిదువులు...దంతపు బొమ్మల లోగిలిలో కొలువైన వారు...యశోద మాట మహా చోద్యమైనట్టు బుగ్గలు నొక్కుకో లేదూ?

పెళ్ళీడు కెదిగిన కొడుకున్నాడంటే తల్లికి వయసు మీద పడిపోతున్నదని దిగులు కాబోలు! అదీ ఆ బుగ్గ నొక్కుళ్ళ లోని భావం!

సరిగ్గా అదే క్షణాన గదిలో మోహన కృష్ణుడి అలంకారాలకు అన్నీ అందిస్తూ యశోద కనుసన్నలలో మెలగుతున్న పరిచారికలు ఎందుకో ఏమిటో తెలియనట్లుగా ముసిముసిగా నవ్వలేదూ? నవ్వుకోలేదూ?

పేరుకు పరిజనమే గాని వట్టి తుళువలు పలువలు. కాకుంటే ముఖాలు చేచాటు చేసుకుని ఆ గుసగుస లేమిటి?

నందరాజు పయనమై పోతున్న వేళ కాబట్టి ఆ క్షణాన యశోద పట్టించు కోలేదు. ఉదయం జరిగిందది. తరువాత ఎవరి పనులలో వాళ్ళు పడ్డారు.

గృహకృత్యాలు, వ్యవసాయపు పనులు, గోశాల వ్యవహారాలు...అన్నీ అజమాయిషీ చేసుకుంటూ ఉండగా మధ్యాహ్నానికి యశోద మనసులో మెల్ల మెల్లగా అనుమాన బీజాలు నాటుకుని మొలకెత్తాయి.

పరిచారికలు, పరిజనం...అందరూ గడుసు వారే! ఒకంతట బయట పడరు. అంతు చిక్కరు.

కవ్వాల దగ్గర హొయలు పోతున్న సంపంగిని నోరు విడిచి అడగనే అడిగింది యశోద "ఏమిటే...ప్రొద్దున్న అంతగా నవ్వులాట అయిందీ...ఈ అత్తగారితో చెప్పరాదనే?..."

"ఆఁ...అదా?...అదీ..."అంటూ కనుతుదల నవ్వు దాచుకుంది సంపంగి. "అప్పుడు మన చెంచులక్ష్మిరవిక...కొంచెం చిట్లి ఉండడం కంట బడిం దత్తయ్యా...అంతేనూ..." అంటూ జడ విసురుతో ముఖం చాటు చేసుకుంది సంపంగి.

ఈ పిల్ల పొగరంతా నడుములో ఉంది. కాకుంటే కవ్వం దగ్గర అంత విసురా? అది చిలికి పారేసింది యశోద మనసునే!

రూకంత కుంకుమ బొట్టుతో రూపవతి ఎదురవగానే ఆమెనూ అడిగింది యశోద... "ప్రొద్దునేమిటీ చిన్నమ్మా...ఎప్పటిలా పరిహాసాలకు కృష్ణయ్యకు పెళ్ళి సంబంధమని ఆయనగారు అంటే...దానికి నేనేదో అంటే...ఇంటి జనమే చాటు నవ్వులు నవ్వడమేమిటి. గుసగుసలుగా వంకర మాట లేమిటి?..."

పెద్ద ముత్తయిదువు రూపవతి. రేపల్లె వాడ ముచ్చట్లు ఆమెకు తెలియనివి కావు. అయినా తెలిసీ తెలియనట్లు గుంభనంగా ఉంటుంది. అందుకే అందరూ అన్ని ముచ్చట్లూ ఆమె చెవిన పడవేసి...అమ్మయ్యా ఎవరికో ఒకరికి చెప్పేశాం... అన్న ఉబలాటం తీర్చుకుంటారు.

"చెప్పరాదూ చిన్నమ్మా? మనలో మనకు...చెప్పుకో గూడని దేమిటి?..." అని యశోద అనునయంగా రెట్టించగానే బుగ్గలో నలుగుతున్న తాంబూలం మరొక్క మారు పారవశ్యంగా నమిలింది రూపవతి. బొడ్డులో నొక్కుకున్న చిన్న పట్టు వస్త్రం మూట నుంచి ఒక్క పిసరు పచ్చ కర్పూరం బొటన వేలి నొక్కుడుతో పుచ్చుకుని నోట పెట్టింది. ఇప్పుడు తాంబూలంతో బాటు మహా రసవత్తరంగా వ్యవహారం ముదిరిందన్నట్టు నవ్వకుండానే బదులు పలికింది:

"ఎన్నెన్నో అనుకుంటాం గాని...తల్లివి...నీకు తెలియనివా?..."

అంతే చెప్పింది రూపవతి. మహా చతురురాలు. వెన్న దుత్తల పని మీద వెళ్ళి పోయింది.

యశోద మనస్సు ఊగి పోయింది. అందరి ధోరణిలో సారాంశం మెల్లగా అర్థమౌతోంది. భర్త ఏమన్నాడు? తనే మన్నది?

మాట వరసకైనా...పెళ్ళి మాటలలో ఇన్ని మెలికలా?

మన కన్నయ్య ఇంకా చిన్న వాడే కదా?

కాదా? కాదా?

రేపల్లె అంతా నవ్వు తోందా? అమ్మో! ఎందుకూ?

పగటి నిద్ర అంతా సెగ రగిలినట్లయింది యశోదకు. కునుకు కూరకనే గడియలోనే ఎవరో కువకువమని నవ్విన సవ్వడి.

లోకోత్తరుడైన కొడుకు ఉండడం గొప్పకు గొప్పే గాని అంతకు మించిన నొప్పి కదా మనసంతా నొప్పి కదా అనుకుంటూ కర్తవ్య మార్గాలు కలబోసి ఆలోచించింది యశోద.

పల్లె బ్రతుకుల కథలు గాథలు ఎన్నెన్ని చందాలో గాని రేపల్లె వాసుల ప్రణయ సన్నివేశాలు వాటి కవే సాటి. వినడానికి వేడుకే. వాటిలో స్వంత మనుషుల పేర్లు దూరితే చిరు చేదు నానాటికీ కటిక చేదే.

పెరిగి పెద్దలైనాక ఎవరికి వారే యమునా తీరే!

కాని బాల కృష్ణుడు ఇప్పుడు పరువాల కృష్ణ డౌతున్నాడు. కన్నెల కన్నులు ఊరుకుంటాయా? ఈ నీల మేఘ శ్యాముణ్ణి ఊరుకోనిస్తాయా?

ఈ బాలుడి బ్రతుకే ఒక లీల. నోరు తెరిస్తే చాలు...సకలసృష్టి స్వరూపాలు దర్శన మిచ్చే లీల. అమ్మో! కట్టి వేసినా కూల్చాడు రక్కసుల్ని! మడుగులో విష సర్పాన్ని తాటి చుట్టలా చుట్టి మదమణచిన నెర జోదు కదూ... వీడేనా?

ఎన్ని దృష్టులు తగులుతుంటాయి ఈ చిట్టి పట్టి మీద!

ఏవో...దైవికాలు అవన్నీ...అంటే వినరు!

మెరుపు తీగల వంటి గొల్ల భామలు కేవలం కన్నుల పలకరింపులతో ఆగి పోతారా?

ఎందుకున్నది యమునా నది? ఆ సైకత స్థలాలు ఎందుకు? పంట

కాలువల కవతల ఎన్నెన్ని మందారవనాలు...మామిళ్ళు...పొగడలు... పొన్నలు ...దేవదారులు...అరటి తోటల పచ్చదనాలు...సరే సరి!

ఈ సస్య శ్యామల కోమల సీమలో శృంగార గాథలు సహజమే!

కాని తన గారాల తండ్రి కృష్ణుడు...నెరజాణలైన గోపికల వలపు వలలలో చిక్కిపోతే? అమ్మో!

తల్లడిల్లి పోకుంటే అది తల్లి మనసేనా? యశోదమ్మ మనసు ఒక మనసా? వెన్నెల వెన్న పూసా?

గోధూళి ధూసరిత కోమల గోప వేషం
గోపాల బాలక శతై రను గమ్య మానం
సాయంతనే ప్రతి గృహం పశు బంధ నార్థం
గచ్ఛంత మచ్యుత శిశుం ప్రణతోస్మి నిత్యం...

తండ్రీ...జగన్నాటక సూత్ర ధారీ...లోక మంతా నీ ఇల్లే అయిన మహానుభావా. ఒక లీలా చరిత్రగా యశోదమ్మ ఇంట సేద దీరడానికి వెళ్తున్న అవతార మూర్తీ...ఈ పూటకు నీ సేవతో తరించాను కాబట్టి మిగతా భూమి సీమలను ఒక మారు పరామర్శించి మళ్ళీ వేకువనే నీ దర్శనం చేసుకుంటాను స్వామీ...

అని ఎర్ర టెర్రటి సాయం కిరణములతో అంజలి ఘటిస్తున్న సూర్య దేవుణ్ణి చిన్న చిరు నవ్వుతో వీడ్కొలుపుతూ

గుంపులు గుంపులుగా తోసుకు వస్తున్న గోపాల బాలుర భుజాల మీద వేసిన చేతులు వేసినట్లుగా అదొక హేలగా పరామర్శగా స్నేహామృతంలో తలమునకలు చేస్తూ

అంభా అంభా రావాలతో వడివడి నడకల గిట్టల చప్పుళ్ళతో పుడమి తల్లికి గిలిగింతలు పెడుతూ ధూళి మబ్బులు రేపుతూ ఆల మందలు చెలరేగి దూసుకు వస్తుండగా

ప్రొద్దున్న వెళ్ళిన కృష్ణుడు ఆ మోహన కృష్ణుడు వేరు
ఇప్పుడు వస్తున్న కృష్ణుడు ఈ గోపాల కృష్ణుడు వేరు...

తన వరమాల ఒక గోవు మెడన చేరింది. జరీ పట్టు వలెవాటు మరో ఆవు కొమ్ములకు సింగారంగా అమరింది. పిల్లన గ్రోవి ఇంకో గోవు మాలక్ష్మి ముకుదాట దూరింది!

ఈ బాలుడంటే ఆ మూగ జీవుల కెంత వలపు! ఎంత ప్రాణం!

వీధి వీధంతా పనులు మరచి ఒళ్ళు మరచి చూసుకునే ఆ దృశ్యాన్ని మరొక్క మారు తిలకించి పులకించి పోతూ...కన్నయ్యను వాకిటిలోనే ఆపి ఎర్ర నీళ్ళ పళ్ళెంలో తమల పాకుతో హారతి కర్పూర దీపంతో దిష్టి తీసి తీసి "నా తండ్రీ...రా వయ్యా..." అని యశోద అక్కున చేర్చుకుంటూ ఉండగా...

ఇరుగు నుంచో పొరుగు నుంచో ఒకే ఒక్క మాట మచ్చు మందు కలిపి కొట్టిన బాణంలాగ దూసుకు రాలేదూ?

"దేవుణ్ణయినా ఎన్నాళ్ళని దాచుకోగలం?... వెర్రిగాని..."

తల్లి మురిపాలు కళ్ళారా చూసుకుంటాడే గాని మారు మాట్లాడడు కృష్ణుడు. మలి సందె స్నానాలు చేతులారా చేయించి పట్టు మడుపులు చుట్ట బెడుతుంటే బాగున్నాయి బాగున్నాయి అన్నట్టు తల ఊపి నవ్వుతాడు.

సరాలు హారాలు వంకీలు ఎంచి ఎంచి తగిలిస్తూ ఉంటే "అమ్మా ఇక చాలునే..." అన్నట్టు అదే నిండు నవ్వు! అయితే ఈ సాయంత్రం మరో చమత్కారం చేసింది యశోద.

చందనపు పెట్టెలోంచి వెండి గజ్జెలు బైటికి తీసింది. చాలా రోజులైంది కృష్ణయ్య వీటిని ధరించి. లోగిలిలో నైనా కృష్ణుడు ఎటు వెళ్ళి ఏ ముప్పు తెచ్చుకుంటాడో నని ఇది వరకు నిత్యం వాటిని కట్టేది యశోద.

తరువాత ప్రమాదాలకే ప్రమాదమై పోయాడు కృష్ణుడు.

గజ్జెలు పెట్టెలో చేరాయి.

"ఇది నీ కాలికి ఉంటే అదో కళ...ఒక సందడి నాయనా!..." అంటున్న యశోద కేసి కళ్ళింతలు చేసుకుని చూశాడు నందకృష్ణుడు.

"అమ్మ కట్టింది కాబట్టి అమ్మే విప్పాలి వీటిని..." అంటూ కాళీయ మర్దనుని కాళ్ళకు ఆ శబ్ద బంధనాలను మనసారా బిగించింది యశోద.

ఎవరి యుక్తులు వారివి.

బుద్ధిగా ఉన్నాడు కృష్ణుడు. బుద్ధిగా విన్నాడు కృష్ణుడు. తర్వాత బుద్ధిగా తిన్నాడు కృష్ణుడు.

వెండి గిన్నెలో వెన్నెల బువ్వలా? తల్లి చేతిలో గోరు ముద్దలా?

నల్ల నల్లని దేవుడే దేవ లోకముల ఎల్లలు దాటి చల్లగా భూమండల వాసి అయినాడు. కన్నులార మనం కాంచ నెంచినా...ఎట్లా వీలవుతుంది?

రాత్రి చీకటిలో వారి కరిమబ్బు మేని చాయ కలిసి పోతుంది కదా?...

అని దిగులు దిగులుగా మినుకు మినుకు మనే తారకా కుటుంబాలను ఓదార్చుతూ...

ఆ తండ్రి మా బావ గారే మా సోదరి ఆదిలక్ష్మికి ప్రాణనాథుడే మా కనులుగప్పి ఎటు పోగలడు....ఎటు దాట గలడు...ఇదిగో చూడండి...ఇదిగో అమృత కాంతులను మించిన వెన్నెల వెలుగులు...

అని పున్నమి చంద్రుడు ధగధగ లాడుతూ లేచి వస్తుండగా...

"అమ్మా...ఆరగింపులతో ఇక్కడనే కను తూగితే...వెన్నెల క్రీడలలో సాటి బాలురంతా నవ్వుకోరూ?...కాస్సేపు...వెళ్ళి రావద్దూ?..." అని గోముగా అడగనే అడిగాడు నవనీత చోరుడు.

కృష్ణుడు ఏదైనా అడిగితే కాదనడ మెలాగో మాత్రం యశోదకు తెలియనే తెలియదు. అంత తమకంలోనూ తెలివి పని చేయబట్టి కదూ అతని కాళ్ళకు మళ్ళీ గజ్జెలు కట్టింది?...

"కాని దూరం వెళ్ళవు కదా నాయనా?..." అని తల్లి సడలింపుగా అన్న వెంటనే "పెరటి తోట అవతలే నమ్మా...గంతులూ గరిడీలూ పందెపు ఆటలూ అన్నీనూ..." అంటూ చెంగున వెళ్ళిపోయాడు కృష్ణుడు.

ఎంతో దూరం లేదు. బాలుర కోలాహలం వినిపిస్తూనే ఉంది. క్షణాల్లో ఆటలో పడిన కృష్ణుడి కాలి గజ్జెల శబ్దం...గాలి తరగల్లో తేలి వస్తూనే ఉంది. మనసు నిండి మోగుతున్నాయి గజ్జెలు.

వీధి మాటు మణిగే వేళ తలుపులు ద్వారాలు ఒక మారు పరామర్శించి ఇల్లంతా చెదిరి ఎవరి తావుల్లో వారు పవళించిన పరిజనాన్ని హెచ్చరించి మేను వాల్చింది యశోద.

ఆప నలవి కానట్లు ఒక్క నిద్ర కమ్మేసింది.

ఒక యుగమో ఒక లిప్త పాటో తెలియ నంతగా గాఢ నిద్ర...సంగీత సభ ముగిసి పోయినట్లు...హఠాత్తుగా మెలకువ వచ్చేసింది.

కలవరపడి చెవి ఒగ్గి వినగా...దూరాన్నుంచి లీలగా విన వస్తూనే ఉంది కృష్ణుడి గజ్జల సవ్వడి.

అయినా యశోద మనసు ఊరుకోలేదు. రాత్రి ముదురుతుంటే ఇంకా ఆట లెందుకు? తను ప్రొద్దున్న దాకా నిద్ర పోతే బిడ్డ ఇంటికి ఎప్పుడు వస్తాడో కని పెట్టుకోవడం ఎలాగ?

పచ్చల పచ్చడాన్ని భుజాల మీదికి లాక్కుంటూనే వడివడిగా పెరటి దారిని వెళ్ళింది యశోద. అమ్మగారి అందెల రవళి గుర్తు పట్టి గోశాలలో వందల కొద్దీ గోవులు హుంకారాలతో పలకరించాయి. పొడి దగ్గులతో చిన్న చిన్న పలకరింపులతో వాటిని హెచ్చరిస్తూ తోట దాటింది యశోద.

బాలురు ఇంకా ఆడుతూనే ఉన్నారు. తుళ్ళుతూ గెంతుతూ మహోత్సాహంలో ఉన్నారు.

కృష్ణుడి గజ్జె పలుకుతూనే ఉంది గాని...ఆ బాలుర మధ్య కృష్ణుడు లేడు. యశోదమ్మ కళ్ళ బడగానే దూసుకొచ్చాడు పదహారేళ్ళ గోపాలు డొకడు. తన కాలికి ఉన్న కృష్ణుడి గజ్జెను విప్పి యశోదమ్మకు దోయిలించి సమర్పించుకున్నాడు.

"అన్నయ్య ఇంత సేపూ ఆడుతుండగా ఇది పడిపోయింది పెద్దమ్మా... నాకు దొరికింది...తెల్లవారాక ఇవ్వడం మరిచిపోతానని...కాలికే కట్టుకున్నాను.." అన్నాడు.

"మరి కృష్ణుడేడీ...ఎటు వెళ్ళినట్టు?..."

"అదేమిటమ్మా...నిద్ర వస్తోందని ఇంటికే కదా...వచ్చాడూ..."

అవునంటే అవునన్నారు మిగతా బాలురందరూ. అందరి ఎదుటా ఇంకా అల్లరి అవడం ఏం బాగు?

వెక్కిరిస్తున్న ఒక్క గజ్జె పట్టీని బొడ్డున దోపి వెను దిరిగింది యశోద. వెన్నెలంతా వేడి గాలులైనట్లు విసురుతుండగా...పెరటి తోటకు వచ్చే సరికే వృద్ధ పరిచారిక నందిని అమ్మ గారిని వెదుక్కుంటూ వచ్చి.... ఎదురయింది.

ఇద్దరి అంతరాల్లో ఒకే ప్రశ్న ముడిబడింది.

"కన్నయ్య వస్తాడులే తల్లీ...నేను వెళ్ళి వెదుకుతాను కదా...నువ్వు నిశ్చింతగా పడుకోరాదూ?..." అని నందిని పూచీ ఇచ్చింది గాని యశోద ఊరుకోలేదు.

"పద...నేనూ వస్తాను గాని..."

"అమ్మా...జాము దాటిన తరువాత...నీ అంతట నువ్వు వీధి దాటడమే...!"

"ష్..ఇది మన మధ్యనే...పరమ రహస్యం! "

"నీ చిత్తం తల్లీ..."

యమునా తీరం వైపు మళ్ళాయి వారి అడుగులు...

యమున దాకా వెళ్ళాలంటే ఎన్ని దాటాలి!

తోటలు...దొరువులు...మావులు...క్రోవులు...గుబులు పుట్టించే పొదరిండ్లు...నాగసర్పాలు యథేచ్ఛగా సంచరించే పుట్టలు గుట్టలు...పల్లె తోటలు దాటిన తరువాత ప్రశాంత పరిమళంతో కమ్ముకునే తులసి వనం...బృందావనం!

ఆ చోటులన్నీ కృష్ణయ్యకు ప్రీతి పాత్రమని ఆబాల గోపాలం చెప్పుకుంటారు! ఎంత ఇష్టమైనా ప్రొద్దుగూకిన వేళ...ఏం చేస్తాడిక్కడ?

వెన్నెల నీడలు పరుచుకున్న పొగడ చెట్ల అవతలి నుంచి కొసరి కొసరి వినవచ్చిన వేణునాదం.

నిశా కన్య నడుము మీద గిలిగింత వంటి సనసన్నటి స్వరం. పారవశ్యాన్ని కూడా పక్కకు నెట్టి నందిని భుజం నొక్కి సైగ చేసింది యశోద. ఆ గానం వింటూ కూడా కదలడం ఎలాగ? చెట్లలో ఆకులైనా కదలవు. పుట్టల్లో పాములైనా మత్తెక్కి పడుకోవూ?

అతి కష్టం మీద వెళ్ళి చూసింది నందిని. పది బారలు దాటి గోరింట కొమ్మ వంచి చూడగానే అద్భుత దృశ్యం కనిపించింది. గోపాలుడు అద్భుతంగా మురళి వాయిస్తుండగా ముగ్గురో నలుగురో పలువురో మరి...గోపికలు వివశలై ఒకరి మీద ఒకరు పవళించి హాయిగా వింటున్నారు. నందిని వంచిన కొమ్మ కూడా రసభంగానికి విసుక్కున్నది కాబోలు...ఆకులు చిరచిర మన్నాయి.

పాట ఆగి పోయింది. మురళి కిందికి దిగింది.

గోపాలుడూ గోపికలూ...తలలు తిప్పిచూసి...ఒకింత లజ్జతో భంగిమలు సర్దుకున్నారు. అదే క్షణంలో నందినికి స్పష్టమైపోయింది. తనే లజ్జతో వంగిపోయి చివ్వున వెనుదిరిగి వచ్చి యశోదమ్మ చేయి పుచ్చుకుని నడిపించుకు పోయింది.

"ఎవరే అదీ?...కన్నయ్య కాదా?"

"కానే కాదు...పద తల్లీ..."

"మరి పిల్లనగ్రోవి పాట?..."

"ఇప్పుడు రేపల్లె గోపాలు రందరిదీ కన్నయ్య దారే! ఆడ మనసుల్ని ఆడించడానికి ప్రతి వాడూ పిల్లన గ్రోవి పాటగాడే! పద పద ముందు చూద్దాం..."

పుప్పొడి దుమారంలా రేగి పోతోంది వెన్నెల.

మొగలి పొదల మలుపు తిరుగుతూ తల తిప్పి చూసింది యశోద. మొగలి మొనల్లా ముడుచుకున్నాయి ఆమె కళ్ళు. ఆ చూపునే అనుసరిస్తూ చూసి

చూసి ఉలికి పడింది నందిని.

రెల్లు గడ్డిలో వెల్లకిలా శయనించింది అప్సరస లాంటి ఒక కన్నె గోపిక. ఆమె ముఖారవిందం మీదికి అప్పుడే వంగుతోంది యువకుని ముఖం. వెనుక నుంచి రూపు తెలియడం లేదు గాని ఆనవాలు తెలిసే సరికి అదిరి పాటు తప్ప లేదు. వెన్నెలలో మిసమిస లాడుతూ చిరుగాలికి ఊగుతోంది....నెమలి ఈకల గుత్తి! శిఖిపింఛ మౌళి...మరెవరు?

ఒక్క ఉదుటున ముందుకు దూకి ఆ ఇరువురినీ విడదీసి చెంపలు పగుల గొట్టాలన్నంత ఆగ్రహం కలిగింది యశోదకు. ఆపద్బాంధవి నందిని సమయానికి వారించకపోతే అంత పనీ చేసేదేమో!

"అరే...ఎవరు వారూ? మా కృష్ణయ్యేనా?" అని నందిని ఒక కూత పెట్టగానే అవతల వెన్నెల్లో వేగుతున్న యువ ప్రేమికులు అదిరిపడి విడివడ్డారు. అమ్మాయి కొంగులో ముఖం ముడుచుకునే క్షణాలలోనే అబ్బాయి తత్తరపాటును అణచుకుంటూ "కాదత్తమ్మా...మేమూ...మరి నేనూ...అంటే...లేగ దూడ కనిపించక ఇటు వస్తుంటేనూ...ముల్లు దిగ బడిందంటేనూ..."

"అరే...నువ్వా?...సాంబయ్య మనవడివే కదూ...?" అంటూ అసాధ్యురాలు నందిని ఆ కుర్రవాడి జాతక చక్రం తిరగేసే లోపలే...

"అత్తమ్మా అది కాదూ...ముల్లు దిగిందంటేనూ..." అంటూ అతగాడు గోప్యపు గొంతుతో ప్రియురాలి పరువు కాపాడ బోయాడు.

"తెలుసులే...అంతా తెలుసులే...మన పద్ధతి తెలుసునుగా...!... ఎక్కడి కథలక్కడే...ఇక్కడివి ఇంకెక్కడికీ పొక్కదు గాని...జాగ్రత్త...ఆ నెమలి కన్ను చూసీ..." అంటూ నందిని యశోదమ్మను ముందుకు నడవమని తొందర చేసింది.

ఆహా! నెమలి కన్ను పెట్టుకున్న వాడల్లా కృష్ణుడేనా?

"చూస్తున్నావుగా తల్లీ...రేపల్లెలో ఇప్పుడు ప్రతి కుర్రవాడూ కృష్ణుడే...! వేషాల కేమీ తక్కువ లేదు...!"

ఒక్క క్షణం పొంగింది తల్లి మనస్సు. మరు నిముషం కుంగింది.

వీళ్ళు చేసే కపటపు పనుల నిందలన్నీ కన్నయ్య మీదే కదా పడేది! ఆట పాటల మోజులో అన్నీ మరచి పోయే పసి బాలుడికి...కన్నె వలపుల రుచి తెలిసిందా?...

ఏది యమున? ఏది యమునా తీరం? ఏది వెన్నెల? తెలియ నంత

తెల్లగా ఏకమై పోయాయి అన్నీ.

వెన్నెల తరగలు ఒక దానితో ఒకటి కొట్టుకున్నట్టు చప్పట్ల మోతతో వలయాకారంగా తిరుగుతూ 'హల్లీసకం' ఆడుతూ వెన్నెల పాటలు పాడుతున్నది ఒక బృందం.

బాల బాలికలా! అందరూ తరుణ వయస్కులేనా? యువతులేనా? ఎవరేమిటో ఏర్పడనంతగా...తెల్లగా దంతపు బొమ్మల్లా మెరుస్తున్నారు. రేపల్లె వాసులా? దిగి వచ్చిన దేవతలా? లేక వీరే వారా?...

మధ్యన ఒక బాలుణ్ణి నిలబెట్టి అందరూ ముద్దు చేస్తూ ఉండగా చిందు చిందుకూ ముందుకు వచ్చి ఓ ముద్దు పెట్టి మరీ ఆడుతున్నారు...

దొరికేవు దొంగా...మా వన్నె దొంగా...వెన్నెక్కడున్నాది...మా మనసు వెన్నా...

ఆ బాలుడెవరు? అంత హొయలుగా నిలుచున్నాడు...కృష్ణుడు గాక మరెవరు?

తప్పులేదు. దొరికాడు వీడు. ఊరి జనం మురిపాలకు మరిగి ఇంటినే మరిచిన ఇలవేల్పు...పట్టుకు పోవాలి తప్పదు మరి...అనుకుంటూ వెర్రి దానిలా ముందుకు ఉరికింది నందిని.ఆ బృందంలో కొందరు అసాధ్యు లున్నారు. అఖండు లున్నారు. వచ్చిందెవరో క్షణాలలో పోల్చుకుని పసికూన ల్లాగా అల్లుకుని మోకరిల్లారు.

"ఇదిగో ఈ చిట్టివాడికి కృష్ణుడి వేషమే కట్టించి ఆడుకుంటున్నాం తల్లీ... వేయి గడపల ఇష్ట దైవం...మా కంత అదృష్టం కూడానా?..."

"అబ్బా...నందినీ...!" యశోద ముఖం వాడిపోయింది.

"నే చెప్పలేదూ తల్లీ....వృథా ప్రయాసే..."

వెను దిరిగి ఇద్దరూ నీరసంగా నడిచారు.

యశోదమ్మ బొద్దు నుంచి ముందుకు వాలి...ముసిముసిగా నవ్వుతోంది గజ్జల పట్టీ...

ఈ సరికి ఇంటికే వచ్చి ఉంటా డనుకున్న కృష్ణుడు రానే లేదు. నడుము నొక్కు కుంటూ నడవలో కూలబడి పోయింది నందిని.

"గడియకు మరో గడియ చూద్దామే. తల్లీ...అప్పటికీ కన్నయ్య రాకుంటే యమున దాటి అయినా సరే ముల్లోకాలు వెతికి అయినా సరే...నే వెళ్ళి రెక్క

పుచ్చుకుని తీసుకొస్తా... నువ్వు నిశ్చింతగా సేద దీరు...నా మీద నమ్మకం పెట్టు..." అని అనేక విధాల ఊరడించింది.

అదీ చూద్దాం అనుకున్నంత వేసటగా యశోద మాట వరసకు పవళించిందే గాని మనసు పీకుతూనే ఉంది. పెరటి నుంచి ఉండీ ఉడిగీ గోవుల హుంకారాలు వినిపిస్తుంటే...అలవాటైన ఆ సవ్వడులలో ఏవో కొత్త స్వరాల ఛాయలు ధ్వనించాయి.

గోసేవలో జన్మ తరించిన యశోదకు క్షణం ఊరుకో బుద్ధి కాలేదు. పనివా రెవ్వరు ప్రాలు మాలినా ఏ మూగ జీవికి గ్రాసం మరచినా తగినంత నీరు పెట్టక పోయినా...వేకువ జామున ఆ గోమాత చూపును భరించడం చాలా కష్టం! వడివడిగా వెళ్ళింది యశోద గోశాలకు. ఆమె అడుగుల సవ్వడికి జవాబుగా గోవుల రుస బుసలతో వాటి మెడలోని గంటల శబ్దంతో రాత్రికే గుండె కరిగి పోయింది.

అయితే ఆ సవ్వడు లన్నిటినీ వెక్కిరిస్తున్నట్టూ ధిక్కరిస్తున్నట్టూ చిలికి సిగ్గుల చిందర వందరైనట్టు మువ్వల సవ్వడి. అది...కాలి మువ్వల సవ్వడే.

ఆ సవ్వడిని సర్దుకొమ్మన్నట్టుగా కిణ కిణ మంటూ తప్పుకు పోతున్నవి గాజులే. అది చేతి గాజుల సవ్వడే...

గోశాల పక్కనుంచి గడ్డి వాములున్న చోటికి రెండే రెండడుగులు వేసింది యశోద.

వాన కారు కాదే! ఆకాశం కాదే! నిండు వెన్నెల్లో నేల మీద అంత నిలువెత్తు మెరుపేమిటి? కోరికంత ఎర్రని చీర కొంగున యవ్వనమంత పసిడి పసిమి అంచులు మెరిసి పోతూ...

మెరిసి మరుగై దూరమై పోయింది. కాని వెన్నెలలో గాలుల్లో మిగిలి పోయి కమ్మింది సౌరభం. అది ఎటువంటి కస్తూరి? ఆ వాసనని కప్పి వేస్తూ పచ్చ కర్పూరపు ఘుమఘుమలే కదూ? సందేహమే లేదు. అది రసిక రమణి తాంబూల పరిమళం!

చీర తళుకు...మువ్వల గాజుల సవ్వడుల బెళుకు...వీడెపు కొసరు వాసన కులుకు...మనసునే ఊపేస్తుండగా...వెన్నెల కుప్ప లాంటి గడ్డి వామి దాటి వెళ్ళింది యశోద. ఒక్క క్షణం. జన్మే తరించింది.

చెదిరి పరుచుకున్న గడ్డి...పాల సముద్రమే. చిద్విలాసంగా పవళించి నవ్వుకుంటున్న వాడు...మరెవరు? వటపత్ర శాయి!

కళ్ళు చెదిరిన మరుసటి క్షణానికి యశోద యశోదే అయింది.

"కృష్ణా! ఇక్కడున్నావా? ఇక్కడా?...ఇక్కడేమిటి?..." అంటూనే ఆగిపోయింది. గడ్డిలో నవ్వుతోంది జాజి మల్లెల దండ. కృష్ణుడి చెంపల మీద వెన్నెల సంతకంలా మెరుస్తోంది...తాంబూల ముద్ర కదూ?...

కదిలిస్తున్న కాలు దిగ్గున దించి, లేచి కూచున్నాడు కృష్ణుడు. ఆ కాలు బోసిగా ఉంది. కృష్ణుడు బుంగ మూతి పెట్టాడు.ఎంత అమాయకుడు పాపం!

"కాలి గజ్జె ఎక్కడో పడి పోతే...వెతుకుతూ ఉండి పోయానమ్మా... దొరకనే లేదు...నువ్వు ఏమంటావోనని...భయపడి..." అంటూ గోముగా దగ్గర కొచ్చాడు. "నువ్వు ఎక్కడి కెళ్ళా వమ్మా?...ఇంట్లో తోచనే లేదు నాకు...ఇట్లా వచ్చి చూస్తే...చూడూ...వెన్నెల ఎంత బాగుందో...పడుకుని చూస్తుంటే... చూడూ...ఆ చంద్రు డెందుకూ అంత విరగబడి నవ్వుతున్నాడూ..."

అవును. చంద్రుడు నవ్వుతూనే ఉన్నాడు. నవ్వడు మరి?

ప్రొద్దున్న నందుడు వచ్చీ రాగానే కుశల ప్రశ్నల కన్నా ముందే అడిగింది యశోద "మన కృష్ణుడికి ఏదో మంచి సంబంధం చూస్తా మన్నారు... కుదిరిందా?"

పట్టలేనంత విస్మయంతో యశోద కేసి నిలువుగా చూశాడు నంద రాజు. "మన కన్నయ్య ఇంకా చిన్న వాడే నని నిన్ననే కదా నువ్వన్నదీ? అంతలో ఎంత పెద్ద వాడై పోయాడూ?..." అన్నాడు.

"అనకూడదు కాని మన వాడి సంగతి మీకు తెలియదు లెండి..." అంటూ ఓరగా పక్క గది వైపు చూసింది యశోద.

నిలువు టద్దంలో చూసుకుంటున్న కృష్ణుడు ఆ మాటతో చిన్నబుచ్చు కున్నట్టు చూశాడు. అద్దంలో యశోద కేసి గోముగా నవ్వాడు. ఇవతలి నుంచి యశోదకు మాత్రమే కనిపించింది...అద్దంలో కృష్ణుడి నవ్వు. జన్మ జన్మల్నీ వెలిగించే నవ్వు. ముగ్ధ మనోహరమైన నవ్వు.

కృష్ణుడు నవ్వుతున్నాడు. నవ్వుతూనే ఉన్నాడు.

యశోద మనసులోనే కాదు.

ప్రతి తల్లి మనసులోనూ. నేటికీ. ఈ నాటికీ. ఎప్పటికీ....